సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

బుధవారం । 7 । జూన్ । 2023



భూముల రీసర్వే లక్ష్యం సాధించాలి
భూముల రీ సర్వేలో లక్ష్యం సాధించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. -IIలో..



రైతులందరికీ రుణాలు అందించాలి
అర్హత గల రైతులందరికీ రుణాలు అందించాలని డీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి పేర్కొన్నారు. -IIలో..



ఘరానా మోసగాడి ఆటకట్టు
ప్లాట్ల పేరుతో నిరుపేదలను మోసం చేసిన ఘరానా మోసగాడిని మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. -IIలో..

న్యూస్‌రీల్

పసుపు కొనుగోలుకు జూన్ 30 వరకు గడువు

కడప అగ్రికల్చర్: జిల్లాలో పసుపు కొనుగోలుకు సంబంధించి జూన్ 30వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు మార్క్‌ఫెడ్ డీఎం నరసింహారెడ్డి తెలిపారు. గతంలో పసుపు కొనుగోలుకు సంబంధించి జూన్ 12వ తేదీ వరకు గడువు ఉండేదని అలాంటిది రైతుల విజ్ఞప్తి మేరకు ఈ గడువును ఈనెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు ఆయన తెలిపారు. రైతులు తమ వద్ద ఉన్న పసుపును కొనుగోళ్ల కేంద్రాలకు తీసుకుని వచ్చి విక్రయించుకోవాలని తెలిపారు. పసుపు కొనుగోలుకు సంబంధించి జిల్లాలో ఆరు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



నిరంజన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న దృశ్యం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లా ఇన్‌చార్జి డీటీసీగా నిరంజన్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత డీటీసీ మీరా ప్రసాద్ వ్యక్తిగత సెలవుపై నెలరోజులు వెళ్లడంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జి డీటీసీగా చిత్తూరు డీటీసీగా పనిచేస్తున్న నిరంజన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు జిల్లాలోని ఎంవీఐలు, ఏఎంవీఐలు శుభాకాంక్షలు తెలిపారు.

డిప్యూటీ తహసీల్దార్ సస్పెన్షన్

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పౌరసరఫరాల సంస్థ గోడౌన్‌లో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ పల్లా రామకృష్ణారెడ్డిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ వి.విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. గోడౌన్‌లో జరుగుతున్న అవకతవకలపై ఆర్డీఓ శ్రీనివాసులుతో పాటు పలువురు అధికారులు ఈనెల 3న విచారణ చేసి నివేదిక పంపారు. ఈ సందర్భంగా గోడౌన్‌లో నిల్వ ఉన్న సరుకులో వ్యత్యాసాలు ఉన్నాయని తేలడంతో డీటీని సస్పెండ్ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ స్థానంలో ఇన్‌చార్జిగా ఎం.శివప్రసాద్‌ను నియమించారు.

అశోక్‌నగర్‌లో ఉపాధ్యాయుడు..

కడప ఎడ్యుకేషన్: కడప మండలం అశోక్‌నగర్ ఎంపీపీఎస్ ఉర్దూలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న పి. సనావుల్లాను మంగళవారం డీఈఓ రాఘవరెడ్డి సస్పెండ్ చేశారు. ఉన్నత అధికారులు జారీ చేసిన పదోన్నతుల ఉత్తర్వులపై సోషల్ మీడియాను ఉపయోగించి అనవసరమైన, ప్రతికూల వ్యాఖ్యలను పోస్టు చేసి ఉపాధ్యాయులలో గందరగోళాన్ని నెలకొల్పినందుకు క్రమశిక్షణా చర్యల కింద సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులను జారీ చేశారు.

సకాలంలో జేవీకే కిట్లు పంపిణీ చేయాలి



కిట్ల నాణ్యతను పరిశీలిస్తున్న లక్ష్మీ నరసింహ రాజు

సిద్దవటం: జగనన్న విద్యా కానుక కిట్లను సకాలంలో ప్రభుత్వ పాఠశాలలకు చేర్చాలని సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ లక్ష్మీ నరసింహ రాజు సూచించారు. మంగళవారం జేవీకే కిట్లను ఆయన పరిశీలించారు. అనంతరం జేవీకే కిట్లు ఎన్ని రకాలు మంజూరు అయ్యాయో వాటిని పరిశీలించారు. మండలంలోని అన్ని పాఠశాలలకు కిట్లను సక్రమంగా చేర్చారా లేదా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు సుజాత, మునీంద్రమ్మ పాల్గొన్నారు.

వైవీయూ బీఈడీ, ఎంఈడీ సెమిస్టర్ ఫలితాలు విడుదల



బీఈడీ, ఎంఈడీ పరీక్షా ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్, సీఈ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని బీఈడీ, ఎంఈడీ మూడో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. వైవీయూలో వీసీ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డితో కలిసి ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ నెలలో నిర్వహించిన బీఈడీ పరీక్షలకు 2,342 మంది విద్యార్థులు హాజరుకాగా, 2240 మంది ఉత్తీర్ణులై 95.64 శాతం ఫలితాలు సాధించారన్నారు. అదే విధంగా ఎంఈడీ పరీక్షలు 98 మంది రాస్తే అందులో 80 మంది ఉత్తీర్ణతతో 81.63 శాతం ఫలితాలు సాధించారన్నారు. కార్యక్రమంలో అదనపు పరీక్షల నియంత్రణాధికారి డా. ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

యువగళం.. గందరగోళం..!

- లోకేష్ పాదయాత్రతో సీనియర్లలో అసహనం
- భూపేష్, ప్రవీణ్‌లకు గ్రీన్‌సిగ్నల్
- నర్మగర్భంగా పుట్టా, పుత్తా అభ్యర్థిత్వ వ్యవహారం
- పసుపు జెండాను గెలిపించాలని మాత్రమే అభ్యర్థన
- ఈవినింగ్ వాక్‌లా సాగుతోన్న యువగళం
- సమీకరించిన కేడర్‌తోనే ముఖాముఖి కార్యక్రమం
- కులాల ఆధారంగా నిర్వహిస్తున్న వైనం



లోకేష్ కార్యక్రమానికి ట్రాక్టర్‌లో మహిళలను తరలిస్తున్న దృశ్యం



ప్లకార్డులను పట్టుకున్న చిన్నారులు

సాక్షి ప్రతినిధి, కడప: యువగళం పాదయాత్రలో టీడీపీ సీనియర్లకు నారా లోకేష్ షాక్ ఇస్తున్నారు. ఒక వైపు పార్టీ టికెట్లు ఇచ్చేది చంద్రబాబే అని అంటూనే, పరోక్షంగా అభ్యర్థులను ప్రకటిస్తున్నారు. జమ్మలమడుగు, ప్రొద్దుటూరులో ఇన్‌చార్జిల అభ్యర్థిత్వాలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా, మైదుకూరు, కమలాపురం అభ్యర్థిత్వాలపై నర్మగర్భంగా వ్యవహరించారు. ఇదిలా ఉండగా ఈవినింగ్ వాకింగ్‌ను తలపించేలా యువగళం పాదయాత్ర కొనసాగుతోంది. నిత్యం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమై పరిస్థితి బట్టి రాత్రి 11 గంటల లోపు ముగుస్తోంది. జనంతో మమేకమై వారి సమస్యలు తెలుసుకునేందుకే పాదయాత్ర చేస్తున్నారని భావిస్తే, అలాంటి వారు తప్పులో కాలేసినట్లే. యువగళం చెంతకు టీడీపీ కేడర్ మినహా, ప్రజలు ఆశించిన స్థాయిలో రావడం లేదు. దీనిని కప్పిపుచ్చుకునేందుకు సమీకరించిన కేడర్‌తో ముఖాముఖీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అదీ కూడా కులాలు ఆధారంగా చేపడుతూ సాగుతున్నారు.

- పాదయాత్ర అంటే ప్రజలతో మమేకమై వారి కష్ట సుఖాలు తెలుసుకొని ఆయా సమస్యలను ఎక్స్‌పోజ్ చేయడం ఆనవాయితీగా చూశాం. నాలుగు దశాబ్దాలుగా ఇలాంటి పాదయాత్రనే ప్రజానీకం గమనించింది. కాగా నారాలోకేష్ పాదయాత్ర అందుకు భిన్నంగా సాగుతోంది. ప్రజలతో మమేకమయ్యే పరిస్థితి కన్పించడం లేదు. ప్రతిరోజూ ఈవినింగ్ వాకింగ్‌లా సాయంత్రం 4 గంటలకు పాదయాత్ర ప్రారంభమవుతోంది. ఈలోపు స్థానికంగా టీడీపీ నాయకులు సమీకరించిన జనాలతో ముఖాముఖీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అదీకూడా ప్రణాళికబద్ధంగా కులాలు ఆధారంగా చేపడుతుండడం విశేషం. టీడీపీ కేడర్‌తోనే చిలుక పలుకులు చెప్పించడం, ఆ తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నిందిస్తూ నారా లోకేష్ ప్రసంగించడం. ముందస్తుగా రచించిన వ్యూహం ప్రకారం యువగళం పాదయాత్ర చేపట్టడం మినహా వాస్తవికత ఆధారంగా చేపట్టడం లేదని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

మదనపడుతోన్న సీనియర్లు...

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఆ పార్టీ సీనియర్లను మదనపెడుతోంది. జిల్లాలో చోటుచేసుకున్న పరిణామం అందుకు నిదర్శనంగా నిలుస్తోంది. జమ్మలమడుగులోకి ప్రవేశించిన ఆయన 'లోకేష్–భూపేష్' జోడి అదిరింది కదూ, అంటూనే అక్కడి కేడర్‌కు భూపేష్ అభ్యర్థిత్వంపై గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ప్రొద్దుటూరుకు వచ్చే కొద్ది ప్రవీణ్‌కుమార్‌రెడ్డికే టికెట్ అని లోకేశ్ పరోక్షంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 'ప్రొద్దుటూరు పౌరుషాన్ని నిలబెట్టింది ప్రవీణ్. మీ తరపున పోరాడినందుకు 29 రోజులు జైలుకెళ్లింది ఈ ప్రవీణ్ (అతన్ని చూపుతూ) అంటూ ఆకాశానికెత్తారు. లోకేష్ మాటలతో అదే వేదికపై ఉన్న మాజీ ఎమ్మెల్యేలు వరదరాజులరెడ్డి, లింగారెడ్డి, టీడీపీ నేత పోట్లదుర్తి సురేష్‌నాయుడు మొహాల్లో నెత్తురు చుక్కలేదు. మా సహకారం లేకుండా ఏజెంట్లను కూడా పెట్టుకోలేని ప్రవీణ్‌ను అభ్యర్థిగా ప్రకటించడం ఏమిటి, ఎలాంటి సంకేతాలు ఇవ్వాలనుకుంటున్నారని వరదరాజులరెడ్డి, లింగారెడ్డిలు సన్నిహితుల వద్ద వాపోతుండడం విశేషం.

యువగళం విజయవంతం కోసం....

ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిందన్నట్లుగా యువగళం విజయవంతం కోసం టీడీపీ నేతలు పడరాని పాట్లు పడుతున్నారు. నారా లోకేష్ కటౌట్లు పెట్టించడం నుంచి పబ్లిక్‌ను చూపించడం వరకూ తంటాలు పడుతున్నారు. ఈపరిస్థితుల్లో బయటి ప్రాంతాల నుంచి లారీలు, ట్రాక్టర్లు పెట్టి ప్రజానీకాన్ని కడపకు వాహనాల్లో తరలిస్తున్నారు. ఆపై పసుపు కండువాలు వారి చేతికి అప్పగించి, నిర్ణయించిన ప్రాంతంలో లోకేష్ పర్యటన కంటే ముందే ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ మొత్తం వ్యవహారం పార్టీ టికెట్ ఆశిస్తున్న ఆశావాహులు నిర్వహిస్తుండడం విశేషం.

▶▶ పుట్టా...పుత్తాకు ఝలక్

మైదుకూరు, కమలాపురం నియోజకవర్గాల్లో కొనసాగిన యువగళం యాత్రకు అక్కడి ఇన్‌ఛార్జిలు పుట్టా సుధాకర్‌యాదవ్, పుత్తా నరసింహారెడ్డిలు కృషి చేశారు. కాగా జమ్మలమడుగు, ప్రొద్దుటూరుల్లోలాగా ఇక్కడ కూడా ఆ ఇరువురి నేతల అభ్యర్థిత్వాలపై స్పష్టత ఇస్తారని ఆశించారు. కాగా, పసువు జెండాను గెలిపించాలని లోకేష్ కోరడం మినహా ఇక్కడి అభ్యర్థులుగా ఆ ఇరువుర్ని గెలిపించాలని లోకేష్ పేరు పెట్టి చెప్పకపోవడం, పుట్టా, పుత్తాల వర్గీయులు ఆందోళనలో ఉన్నారు. పైగా అటు పుట్టా సుధాకర్ వ్యతిరేకిస్తున్న రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, పుత్తా నరసింహారెడ్డి వ్యతిరేకిస్తున్న మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డిలు నారా లోకేష్ యువగళంలో ప్రత్యక్షం కావడంతో వారు మరింత ఒత్తిడికి గురవుతున్నట్లు సమాచారం. చెన్నూరు సమీపంలో ఏర్పాటు చేసిన క్యాంపులో నారా లోకేష్‌తో వీరశివారెడ్డి ప్రత్యేకంగా భేటీ కావడం కమలాపురం టీడీపీలో అలజడి రేపుతున్నట్లు తెలుస్తోంది.

శిక్షణ పూర్తి చేసుకున్నవారికి ఉద్యోగ అవకాశాలు

- జిల్లా న్యాక్ శిక్షణాధికారి నాగార్జున



సర్టిఫికెట్‌ను ప్రదానం చేస్తున్న జిల్లా శిక్షణాధికారి నాగార్జున, తదితరులు

పులివెందుల రూరల్ : న్యాక్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని న్యాక్ జిల్లా శిక్షణాధికారి నాగార్జున పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని న్యాక్ కార్యాలయంలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, న్యాక్‌ల ఆధ్వర్యంలో గ్రీన్‌కో సహకారంతో జరిగిన సోలార్ పి.వి. ఇంజనీర్ శిక్షణా తరగతులు ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా శిక్షణాధికారి నాగార్జున మాట్లాడుతూ న్యాక్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు శ్రీసిటీలోని సీటెక్ రెన్యువబుల్ ఎనర్జీ లిమిటెడ్‌లో రూ.18,500ల వేతనంతో ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. అలాగే శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లను కూడా ప్రదానం చేశారు. అలాగే జీ–20 సదస్సు సన్నాహక కార్యక్రమమైన జెన్భాగిదారిలో భాగంగా స్కిల్ మాస్టర్ తరగతులను వెబ్‌నార్ ద్వారా అందించారు. కార్యక్రమంలో న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ రాకేష్, మాస్టర్ ట్రైనర్ శ్యాంప్రసాద్, కో.ఆర్డినేటర్ తరుణ్, న్యాక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాబ్ డ్రైవ్

రాయచోటి: రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్ డ్రైవ్ కార్యక్రమం ముగిసింది. మంగళవారం కళాశాలలో ఐసీఐసీఐ బ్యాంకింగ్ సంస్థలలో రిలేషన్ షిప్ మేనేజర్ ఉద్యోగానికి జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో జాబ్ డ్రైవ్ నిర్వహించారు. జాబ్ డ్రైవ్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ హర్షలత ప్రారంభించారు. అన్నమయ్య జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 32 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. వీరిలో ఐదుగురిని ఎంపిక చేసినట్లు జేకేసీ సమన్వయకర్త టి.వెంకటరమణ తెలిపారు. జేకేసీ మెంటార్ సుధీర్ కుమార్, హెచ్‌ఆర్ కిరణ్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

హెచ్‌ఐవీ రోగులకు మెరుగైన సేవలు అందించాలి



కడప రిమ్స్‌లో మాట్లాడుతున్న హెచ్‌ఐవి/ఎయిడ్స్ కంట్రోల్ రాష్ట్ర అధికారులు

కడప అర్బన్: జిల్లాలో హెచ్‌ఐవి/ఎయిడ్స్ రోగులకు మెరుగైన సేవలను అందించడంలో జిల్లా యంత్రాంగం కృషి చేయాలని ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వై. కామేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం పీఈ ఎఫ్ఏఆర్ కో ఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ వై కామేశ్వరప్రసాద్, డబ్ల్యుహెచ్ఓ సిము కన్సల్టెంట్ ఏ. సుకుమార్ తదితరులు జిల్లాలో హెచ్‌ఐవి/ఎయిడ్స్ రోగులకు అందుతున్న సేవలను ఆకస్మిక తనిఖీ చేశారు. వీరితో పాటు డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.కె ఖాదర్‌వల్లీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రోగ్రాం మేనేజర్ వి. భాస్కర్, పి.వి ప్రసాద్, డీఎం అండ్‌ఈ సిలార్, ప్రోగ్రాం అసిస్టెంట్ ఎస్. అబ్దుల్ సాదిక్ పాల్గొన్నారు. కడప నగర శివార్లలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో డీఎస్ఆర్‌సీ, సంపూర్ణ సురక్ష కేంద్రాన్ని ప్రారంభించేందుకు సలహాలు, సూచనలు చేశారు. ఆసుపత్రిలో ఐసీటీసీ సెంటర్‌లో, ఏఆర్‌టీ సెంటర్, డీఎస్ఆర్‌సీ, పీసీటీసీటీ , పీఎల్ అండ్ టింగో పార్టనర్స్ అందరితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో కేసుల వివరాలు, ఏఆర్‌టీ లింకేజెస్, సిడిఫోర్, వైరల్ లోడ్ ల్యాబ్ పనితీరును, కౌన్సిలర్‌ల రికార్డులను పరిశీలించారు. క్లయింట్స్ సేవలందించడంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించాలి

- ఉద్యోగులు తప్పులు చేస్తే సహించేది లేదు
- ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు
- జిల్లాలో 12551 వ్యవసాయ సర్వీసులు విడుదల చేసినందుకు అభినందన



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు

కడప కార్పొరేషన్: రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించాలని ఏపీఎస్‌పీడీసీఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సంతోషరావు అన్నారు. మంగళవారం సాయంత్రం విద్యుత్ భవన్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులంతా సంతోషంగా ఉండాలని, అదే క్రమంలో విధి నిర్వహణలోనూ సమర్థవంతంగా పనిచేయాలన్నారు. ఎక్కడైనా తప్పులు జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో అత్యధికంగా 12551 వ్యవసాయ సర్వీసులు విడుదల చేసినందుకు అధికారులను అభినందించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పగటి పూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరాలో ఎలాంటి జాప్యం ఉండకుండా చూసుకోవాలన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వడానికి ప్రభుత్వం ప్రతి యూనిట్‌కు అత్యధికంగా రూ.7.72 చెల్లిస్తోందని తెలిపారు. ఒక వ్యవసాయ సర్వీసు త్వరగా విడుదల చేయడం వల్ల సంస్థకు మేలు జరుగుతుందని గుర్తుంచుకోవాలన్నారు. డీబీటీ పథకం ద్వారా రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించడమే గాక సంస్థకు ప్రతి యూనిట్ అకౌంటబిలిటీలోకి వస్తుందన్నారు. రైతుల వద్దనుంచి బ్యాంకు వివరాలను తప్పక తీసుకోవాలన్నారు. జగనన్న కాలనీల్లో విద్యుత్ సర్వీసులను యుద్ధ ప్రాతిపదికన ఇవ్వాలన్నారు. దేశాభివృద్ధికి మానవ వనరులు విలువైనవని, ఒక ఇంటి పెద్దను కోల్పోతే ఆ కుటుంబ సభ్యులు పడే వేదన, ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి ప్రతి దానిపై ప్రభావం పడుతుందన్నారు. విద్యుత్ ప్రమాదల నివారణే లక్ష్యంగా కింది స్థాయి నుంచి పై స్థాయి సిబ్బంది వరకూ కృషి చేయాలన్నారు. జిల్లాలో పేరుకుపోయిన బకాయిలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలన్నారు. ఎతు సమావేశంలో ఏపీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ కె. శివప్రసాద్‌రెడ్డి, ఓఎస్‌డీ ఎన్. శ్రీనివాసులు, చీఫ్ జనరల్ మేనేజర్లు ధర్మజ్ఞాని, గురవయ్య, ఎస్ఈ ఎస్. రమణ, ఉమ్మడి జిల్లాల అకౌంట్ ఆఫీసర్ మధు, ఈఈలు, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

పశు బీమా.. అన్నదాతకు ధీమా

- పాడి రైతులకు అండగా వైఎస్సార్ పశుబీమా
- పశువులతో పాటు మూగ జీవాలకు బీమా

కడప అగ్రికల్చర్: వ్యవసాయ అనుబంధ రంగాల్లో పాడి పరిశ్రమ ప్రాధాన్యం వెలకట్టలేనిది. వేలకు వేలు పెట్టుబడి పెట్టి తెచ్చుకున్న పశువులు, గొర్రెలు, మేకలు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా అనారోగ్యం, ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలతో పశు సంపదకు నష్టం జరిగి ఆర్థకంగా దెబ్బ తీస్తాయి. ఈ ప్రతికూలత నుంచి అన్నదాతలు గట్టెక్కేందుకు ఉద్దేశించిందే ఈ పశుబీమా పథకం. గత సర్కారు హయాంలో ఈ పథకం రూపొందించినా అశాస్త్రీయ విధానాలతో లబ్ధిదారులకు ఆశించిన మేర ప్రయోజనం దక్కలేదని విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ పశు నష్ట పరిహార పథకం స్థానంలో మార్పులు చేసి కొత్తగా డాక్టర్ వైఎస్సార్ పశు బీమా పథకాన్ని రూపకల్పన చేసింది. ఈ పథకం రైతులకు ఎంతో ఉపయోగమని చెప్పవచ్చు.

ఒక్క సారి ప్రీమియం చెల్లిస్తే...

ఈ పథకంలో ఒక సారి ప్రీమియం చెల్లిస్తే పశువులు, గేదెలకు మూడేళ్లపాటు, మేకలు, పందులకు ఒకటి నుంచి మూడేళ్లపాటు ఈ బీమా వర్తిస్తుంది. గతంలో మాదిరి నెలలు, సంవత్సరాల పాటు కాలయాపన చేయకుండా గేదెగానీ, జీవం గాని మృతి చెందిన 21 రోజులకు వాటి పెంపకం దారులకు, యాజమానుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతుంది. ఏదైనా సాంకేతిక కారణాలతో బీమా పరిహారం జమకాకుంటే ఈ విషయాన్ని సంబంధిత వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు.

పథకం వర్తింపు ఇలా......

పశుబీమా పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారు ప్రీమియం మొత్తంలో 20 శాతం, మిగతా వర్గాల వారు 50 శాతం చెల్లించాల్సి ఉంటుంది. ఈ పథకం ద్వారా గరిష్ఠంగా 5 గేదెలు, 50 గొర్రెలు, మేకలకు పశుబీమా చేసుకునేందుకు వీలు కల్పించారు. రూ.30 వేలు ఖరీదు చేసే గేదె లేదా ఆవుకు మూడు సంవత్సరాలకు ప్రీమియం 6.4 శాతం రూ.1920గా నిర్ణయించారు. అందులో ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులకు రూ.383 , ఏపీఎల్ లబ్ధిదారులకు రూ.960 తమ వాటాగా చెల్లించాలి.



గేదెలు



గొర్రెలు

- రూ. 15 వేలు ఖరీదు చేసే గేదె లేదా ఆవుకు మూడు సంవత్సరాల ప్రీమియం 6.4 రూ. 960, ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్‌కు రూ. 192 , ఏపీఎల్ లబ్ధిదారులకు రూ. 480 చెల్లించాల్సి ఉంటుందన్నారు.
- రూ. 6 వేలు విలువ చేసే గొర్రె, మేక, పందులకు ఒక సంవత్సరం మొత్తం ప్రీమియం 3 శాతం రూ. 180 నిర్ణయించామన్నారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులకు రూ. 36, ఏపీఎల్ లబ్ధిదారులకు రూ. 90 వాటాగా చెల్లించాలన్నారు.
- రూ. 6 వేలు విలువ చేసే గొర్రె, మేక, పందులకు మొత్తం ప్రీమియం రెండు సంవత్సరాలకు 4.5 శాతంగా రూ. 270గా నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్‌కు రూ. 54, ఏపీఎల్ లబిదారునికి రూ. 135 వాటా చెల్లించాల్సి ఉంటుందన్నారు.
- 3 సంవత్సరాల ప్రీమియం 6.25 శాతం రూ. 375 , ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులకు రూ. 75 , ఏపీఎల్ లబ్ధిదారులకు రూ. 187.50 వాటాగా చెల్లించాలి.

ఈ పశు బీమా పొందాలంటే....

ఈ పశుబీమా పొందాలంటే రైతులు తమకు సమీపంలో ఉన్న రైతు భరోసా కేంద్రానికి వెళ్లి వారి జీవాల వివరాలతో రైతు వాటా ప్రీమియం సొమ్మును ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుంది. ఇలా చేస్తే ఆ రైతుకు అతని జీవాలకు బీమా సదుపాయం వర్తిస్తుంది. బీమా సొమ్ము చెల్లించిన పెంపకదారుడు, యజమాని వాటిని వేరే రైతుకు విక్రయిస్తే ఆ వివరాలను ఏడు రోజుల్లో దగ్గర్లో ఉన్న రైతు భరోసా కేంద్రంలో తెలియచేయాలి. అలాగ చేస్తే జీవాలను కొనుగోలు చేసిన కొత్త రైతుకు బీమా సౌకర్యం వర్తిస్తుంది. బీమా పరిహారం పొందడానికి ట్యాగ్ తప్పని సరిగా ఉండాలి. పశువు మృతి చెందిన వెంటనే వైద్య సిబ్బంది, పశు సంవర్థశాఖ అధికారులకు సమాచారమివ్వాలి. దీంతో వారు పరిశీలించి కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించి నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతారు. తరువాత పశు యజమానికి సాధ్యమైనంత త్వరగా బీమా మొత్తం అందుతుంది.

జిల్లాలో వివరాలు..

కేటగిరీ	సంఖ్య (లక్షల్లో)
ఆవులు, ఎద్దులు:	0.44
ఎనుములు	3.99
గొర్రెలు, పొట్టేళ్లు	9.84
మేకలు	3.62
పందులు	0.03

అవగాహన కల్పిస్తున్నాం...



డాక్టర్ వైఎస్సార్ పశు బీమా పథకంపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. జీవాలకు ఇన్సూరెన్స్ తప్పనిసరిగా చేయించుకోవాలి. పశువులు, గొర్రెలు, మేకలు మృతి చెందిన సందర్భంలో పశుసంవర్ధశాఖ అధికారులకు తెలియచేయాలి. 21 రోజుల్లో బీమా పరిహారం రైతుల ఖాతాల్లో జమ అవుతుంది.

– శారదమ్మ, జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి

పరిహారంపై రైతులతో చర్చలు



ఎగువపల్లెలో రైతులతో చర్చిస్తున్న ఎస్‌డీసీ రమేష్‌రెడ్డి, తదితరులు

లింగాల : పార్నపల్లె చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి వేముల మండలంలోని యురేనియం ప్రభావిత గ్రామాల ప్రజలకు స్వచ్ఛమైన తాగు, సాగునీరు అందించేందుకు భారీ పైపులైన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఈ పైపులైన్ ఏర్పాటువల్ల భూములను కోల్పోతున్న కోమన్నూతల, ఎగువపల్లె, దిగువపల్లె, మురారిచింతల, అంబకపల్లె గ్రామాల్లో భూసేకరణ నిర్వహిస్తున్నారు. ఈ విషయమై మంగళవారం భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమేష్‌రెడ్డి ఆయా గ్రామాల రైతులతో సమావేశం నిర్వహించి చర్చలు జరిపారు. భూములు కోల్పోతున్న రైతుల వివరాలను ఇదివరకే ప్రకటించామన్నారు. నష్టపరిహారం కోసం ఆయా రైతులు పట్టాదారు పాసు పుస్తకాలు, ఆధార్ కార్డులు, బ్యాంక్ అకౌంట్ నెంబర్లు త్వరితగతిన అందించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ త్రిభువన్‌రెడ్డి, ఆర్ఐ సురేంద్ర, వీఆర్ఓలు, సర్వేయర్లు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ప్రొద్దుటూరు క్రైం : స్థానిక మైదుకూరు రోడ్డులోని ఆరవేటి థియేటర్ సమీపంలో ఉన్న బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మంగళవారం స్థానికులు సమాచారం అందించడంతో టూ టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడి సంబంధించిన వివరాలు తెలిసిన వారు టూ టౌన్‌పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ రెడ్డిసురేష్ కోరారు.

రోడ్డు ప్రమాదంలో సర్వేయర్‌కు తీవ్ర గాయాలు

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని నిడుజివ్వి గ్రామ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విలేజ్ సర్వేయర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. వారు తెలిపిన వివరాల మేరకు.. తిప్పలూరు గ్రామానికి చెందిన మనీషా ప్రస్తుతం ఎర్రగుంట్ల పట్టణంలో నివాసం ఉంది. ముద్దనూరు మండల పరిధిలోని పెనికలపాడు గ్రామ సచివాలయంలో విలేజ్ సర్వేయర్ పని చేస్తోంది. సాయంత్రం స్కూటీలో ఇంటికి బయలు దేరింది. నిడుజివ్వి గ్రామ సమీపానికి రాగానే ఎదురుగా మరో స్కూటర్ వస్తోంది. రెండు స్కూటర్లు ఢీకొనడంతో మనీషాకు తీవ్ర గాయాలు అయ్యాయి. మరో స్కూటర్‌పై వస్తున్న వారికి కూడా గాయాలు అయ్యాయి. వారిని 108 వాహనంలో ప్రొద్దుటూరుకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం మనీషాను తిరుపతికి తరలించినట్లు సమాచారం.

బైక్‌ను ఢీకొన్న కారు

రామాపురం : కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండల పరిధి గువ్వలచెరువు పార్కింగ్ స్థలంలో మంగళవారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో స్కూటరిస్టు దర్బార్‌బాషా (35) దుర్మరణం చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. సుండుపల్లె మండలం రాయవరానికి చెందిన దర్బార్‌బాషా బైక్‌పై గువ్వలచెరువు నుంచి తిరిగివెళ్తుండగా కడప వైపు నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దర్బార్‌బాషా అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.

భూముల రీసర్వే లక్ష్యం సాధించాలి

- జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్
- తహసీల్దార్ కార్యాలయాల తనిఖీ



ముద్దనూరులో లాప్‌ట్యాప్‌లో భూ రీసర్వేను పరిశీలిస్తున్న జేసీ గణేష్ కుమార్

ముద్దనూరు : జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా చేస్తున్న భూముల రీ సర్వేలో లక్ష్యం సాధించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలలో జరుగుతున్న భూముల రీ సర్వే తీరుపై సిబ్బందిని ప్రశ్నించారు. ల్యాప్ టాప్‌లో సర్వే పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దారు వెంకటేశ్వర్లు, డీటీ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులు పరిష్కరించాలి

జమ్మలమడుగు రూరల్ : స్పందనలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన జమ్మలమడుగు ఆర్డీఓ కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం ఆర్డీఓతో కలసి జమ్మలమడుగు తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఆయన సూచించారు. అలాగే మైలవరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ జి.శ్రీనివాసులు, తహసీల్దార్లు వేణు గోపాల్, తిరుపతయ్య, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దముడియం : మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ స్థలం పరిశీలన

కమలాపురం : కమలాపురం–అయ్యవారిపల్లె గ్రామ రోడ్డు నిర్మించిన భూములను జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ పరిశీలించారు. పదేళ్ల క్రితం కమలాపురం–అయ్యవారిపల్లె వయా పెద్దచెప్పలి మీదుగా పాయసంపల్లె వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు ఇప్పటికీ నష్ట పరిహారం అందలేదు. ఈ నేపథ్యంలో జేసీ గణేష్ కుమార్ అధికారులతో కలసి రోడ్డు నిర్మించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి విలువను బట్టి డ్రాఫ్ట్ నోటిఫికేషన్, డ్రాఫ్ట్ డిక్లరేషన్ ఇవ్వాలని అధికారులకు సూచించారు. భూ బాధితులకు న్యాయం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అలీఖాన్, ఆర్అండ్‌బీ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో జెడ్పీటీసీపై దాడి



ఆస్పత్రిలో వివరాలు వెల్లడిస్తున్న జెడ్పీటీసీ జయరామిరెడ్డి

గోపవరం : మండలంలోని టీ.సండ్రపల్లెలో గోపవరం జెడ్పీటీసీ (టీడీపీ) కలువాయి జయరామిరెడ్డిపై అదే గ్రామానికి చెందిన మద్దిక సుబ్బారెడ్డి ఉరఫ్ సుబ్బరాయుడు అనే వ్యక్తి మద్యం మత్తులో మంగళవారం తెల్లవారుజామున దాడికి పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం రాత్రి సండ్రపల్లె గ్రామంలో గజ్జెపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమం రాత్రంతా కొనసాగింది. ఈ నేపథ్యంలో సుబ్బారెడ్డి ఉరఫ్ సుబ్బరాయుడు మద్యం సేవించాడు. ఆ మత్తులో మంగళవారం తెల్లవారుజామున ముందుగా జెడ్పీటీసీ జయరామిరెడ్డి సోదరి క్రిష్ణమ్మ ఇంటి వద్దకు వెళ్లి దుర్భాషలాడుతుండగా.. అంతలో జయరామిరెడ్డి అక్కడికి రావడంతో సుబ్బరాయుడు అతనిపై దాడికి దిగాడు. అడ్డుకోబోయిన సోదరి క్రిష్ణమ్మ, బావమరిది రమణారెడ్డిలకు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన జరిగిన వెంటనే బద్వేలు రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది గ్రామానికి చేరుకుని దాడికి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. జెడ్పీటీసీ జయరామిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ దాడికి, రాజకీయ పార్టీలకు ఎలాంటి సంబంధం లేదని, కేవలం మద్యం మత్తులోనే దాడి జరిగినట్లు భావించి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా మద్యం మత్తులో జరిగిన దాడిని టీడీపీ నాయకులు, ఎల్లో మీడియా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అంటకట్టి రాద్ధాంతం చేయడంపై గ్రామస్తులు పెదవి విరుస్తున్నారు. ఏ పార్టీకి సంబంధం లేని ఓ వ్యక్తి మద్యం మత్తులో దాడికి పాల్పడితే, దానికి రాజకీయ రంగు పులమడం సరైన సంస్కృతి కాదని ప్రజలు చర్చించుకోవడం గమనార్హం.

రైతులందరికీ రుణాలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి

కడప అగ్రికల్చర్ : అర్హత గల ఏ ఒక్క రైతుకు కూడా బ్యాంకు రుణాన్ని నిరాకరించరాదని డీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి పేర్కొన్నారు. మంగళవారం కడప డీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో బ్యాంకు సూపర్‌వైజర్స్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బ్యాంకు సిబ్బందికి 2023–24 సంవత్సరానికి సంబంధించి దిశా నిర్దేశం చేశారు. ఎక్కడా అవినీతికి తావు లేకుండా చూడాలన్నారు. గ్రామాలలో ఇళ్లు నిర్మించుకోవడానికి రైతులకు రుణాలను మంజూరు చేయాలన్నారు. అలాగే రైతుల బిడ్డలకు విద్యా రుణాలను కూడా మంజూరు చేయాలని సూచించారు. సొసైటీలలో కంప్యూటరైజేషన్‌ను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. సొసైటీలపై నమ్మకం పెరగడానికి కావాల్సిన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. డీసీసీ బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్ మాట్లాడుతూ రుణాలను సక్రమంగా సకాలంలో వసూలు చేయాలన్నారు. ఎక్కడైనా అవినీతి జరిగినట్లు తెలిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఓయస్‌డీ గురప్ప, జీఎం సురేంద్ర, డీజీఎంలు రాజామణి, ప్రతాప్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ కేశప్ప

మదనపల్లె : తంబళ్లపల్లె మండలంలో సంచలనం సృష్టించిన హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ కేశప్ప తెలిపారు. తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె గ్రామం ఎర్రివారిపల్లెకు చెందిన రామిగాని యర్రంరెడ్డి(32) దారుణ హత్యకు సంబంధించిన వివరాలను డీఎస్పీ మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కోసువారిపల్లె గ్రామం గుమ్మడికాయలవారిపల్లె, ఎర్రివారిపల్లె పక్కపక్కన గ్రామాలు. గుమ్మడికాయలవారిపల్లెకు చెందిన దేవరపెద్దగారి మధుకర్‌రెడ్డి, ఎర్రివారిపల్లెకు చెందిన రామిగాని యర్రంరెడ్డి స్నేహితులు. వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ, మగ్గం పనులు చేసుకునే వారు. వీరిద్దరికీ ప్రతి రోజు మద్యం తాగే అలవాటు ఉంది. ఇద్దరూ తమ గ్రామాల్లోని ఖాళీ ప్రదేశాలు, పొలాల్లో మద్యం సేవించే వారు. ఈక్రమంలో ఈనెల 3న రామిగాని యర్రంరెడ్డి, దేవరపెద్దగారి మధుకర్‌రెడ్డి మిగిలిన స్నేహితులతో కలిసి మందు తాగాలని నిర్ణయించుకున్నారు. అయితే స్నేహితులు పనులకు వెళుతున్నామని చెప్పడంతో మడికయ్యల వద్ద యర్రంరెడ్డి, మధుకర్‌రెడ్డి ఇద్దరూ కలిసి అతిగా మద్యం సేవించారు. మద్యం మత్తులో ఇద్దరి మధ్య డబ్బుకు సంబంధించి గొడవ జరిగింది. ఒకరిపై ఒకరు దాడి చేసుకునే స్థాయికి వెళ్లింది. పట్టరాని ఆవేశంతో మధుకర్‌రెడ్డి స్నేహితుడైన యర్రంరెడ్డిని పెద్దరాయితో తలకు కుడివైపుగా కణతిపై రెండుసార్లు కొట్టగా, తలకు బలమైన రక్తగాయంతో కిందపడిపోయాడు. చనిపోయాడని భావించిన మధుకర్‌రెడ్డి నేరస్థలం నుంచి పారిపోయాడు. అప్పటికే వీరిద్దరి అరుపులు విన్న గ్రామస్తులు అక్కడికి చేరుకుని అపస్మారక స్థితిలో పడి ఉన్న యర్రంరెడ్డిని 108 అంబులెన్స్‌లో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించగా చికిత్సలు పొందుతూ యర్రంరెడ్డి చనిపోయాడు. దీంతో మృతుడి తల్లిదండ్రులు రాధమ్మ, సుదర్శన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని సీఐ శివాంజనేయులు, ఎస్ఐ రామాంజనేయులు విచారణ సాగించారు. దర్యాప్తులో సెల్‌ఫోన్ కాల్‌డేటా, ప్రత్యక్షసాక్షుల వాంగ్మూలం, నేరస్థలంలో వేలిముద్రలు, డాగ్‌స్క్వాడ్, సాంకేతిక ఆధారాలతో మధుకరరెడ్డిని నిందితుడిగా గుర్తించి ముదివేడు క్రాస్‌లో అరెస్ట్ చేశారు. హత్యానేరం కింద కేసు నమోదైనందున నిందితుడు మధుకరరెడ్డిపై రౌడీషీట్ ఓపెన్ చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు డీఎస్పీ తెలిపారు.

ఎన్ఐఆర్ఎఫ్ ఇన్నోవేషన్ ర్యాంకుల్లో కేఎస్ఆర్ఎంకు చోటు

కడప ఎడ్యుకేషన్ : కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వశాఖ సోమవారం విడుదల చేసిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ ఇన్నోవేషన్–2023 ముసాయిదాలో ఇంజినీరింగ్ విభాగంలో కేఎస్ఆర్ఎం 151– 300 జాబితాలో ఎంపికైందని కళాశాల ఎండీ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, ప్రధానాచార్యులు వీఎస్ఎస్ మూర్తి తెలిపారు. స్థానిక ఆ కళాశాలలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉన్నత విద్యాశాఖ ఎన్ఐఆర్ఎఫ్ ఇన్నోవేషన్‌లో ఉత్తమ ర్యాంకింగ్ కోసం దేశంలోని వివిధ దిగ్గజ విద్యాసంస్థలైన ఐఐటీలు, ఎన్ఐటీలు, కేంద్రీయ విశ్వ విద్యాలయాలు, రాష్ట్రీయ విశ్వ విద్యాలయాలు, అటానమస్ ఇంజినీరింగ్ కళాశాలలు పాల్గొన్నాయని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 12 ప్రముఖ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు 151–300 ర్యాంకింగ్ జాబితాలో చోటు సంపాదించుకోగా.. అందులో కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. బోధన, అభ్యసనం, సంస్థాగతీకరణ, ఇన్నోవేషన్ ఎంటర్‌ప్రెన్యూర్ సిప్, ప్రీ ఇంకుబేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఓటో టైపు ఆవిష్కరణల ఉత్పత్తి, స్టార్ ఆఫ్ ఇండస్ట్రీ అసోసియేషన్‌లతో కలిసి సేవలను బలోపేతం చేయడం, ఆవిష్కరణలకు మద్దతు ఇవ్వడం ప్రామాణికాలను పరిగణనలోకి తీసుకుని ఎంపిక చేశారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ కందుల మదన్‌మోహన్‌రెడ్డి, కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ, రీసెర్చ్ డెవలప్‌మెంట్ విభాగ, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

కారు టైరు పగిలి.. చెరువులో పడి..



కారును పరిశీలిస్తున్న పోలీసులు



మృతి చెందిన రమేష్

రామాపురం : మండల పరిధిలోని కొండావాండ్లపల్లె సమీపంలో మంగళవారం ముందు టైరు పగలడంతో కారు చెరువులో పడి ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి.

తిరుపతి పట్టణానికి చెందిన ఏపీఎమ్ఐఎస్ఐ డివిజనల్ ఇంజనీర్ రమేష్ (58) కారులో అన్నమయ్య జిల్లా రామాపురం మండలం హసనాపురం పంచాయతీ పప్పిరెడ్డిగారిపల్లెలోని అమర్‌నాథరెడ్డి ఇంట్లో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యాడు. తిరిగి కారులో వెళ్తుండగా కొండావాండ్లపల్లె చెరువు కట్ట సమీపంలో టైరు పగిలి కారు బోల్తా పడింది. కారు నడుపుతున్న డి.రమేష్ అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి, క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.

పోలీస్ లాంఛనాలతో ఏఎస్ఐ అంత్యక్రియలు



ఏఎస్ఐ షాజహాన్‌కు అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసుల బృందం

రామాపురం : కర్నూలు జిల్లా మద్దికెరలో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రామాపురం మండలం నీలకంఠ్రావుపేటకు చెందిన షేక్ షాజహాన్(59) అనారోగ్యంతో మంగళవారం తిరుపతి ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందారు. అంత్యక్రియలు స్వగ్రామంలోని నీలకంఠ్రావుపేటలో సాయంత్రం 5 గంటలకు పోలీసుల లాంఛనాలతో నిర్వహించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె కలరు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా పోలీసుల సంఘం అధ్యక్షులు నాగరాజు, మద్దికెర ఏఎస్ఐ ఫణిరాజు, హెడ్‌కానిస్టేబుల్ కుమార్, రామాపురం, రాయచోటి పోలీసులు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రలో దొంగల చేతివాటం

కడప అర్బన్ : యువగళం పేరుతో కడప నగరంలో తమ పార్టీ నాయకులతో కలిసి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర మంగళవారం సాయంత్రం బిల్టప్ సర్కిల్ నుంచి ప్రారంభమైంది. ఈ పాదయాత్రలో జేబుదొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. పోలీసులు తమ వంతుగా బందోబస్తు విధులను సమర్థవంతంగా నిర్వహించినప్పటికీ.. దొంగలు ఇద్దరు వ్యక్తుల దగ్గర ఒక్కొక్కరి నుంచి ఐదు వేల రూపాయల చొప్పున కాజేశారు. ఈ సంఘటనలపై ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని పోలీసులు తెలియజేశారు.

నిరుద్యోగులను నట్టేట ముంచుతున్న పాలకులు



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు

రాయచోటి అర్బన్ : దేశంలో నిరుద్యోగులను పాలకులు మాయమాటలతో నట్టేట ముంచుతున్నారని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ జిల్లా స్థాయి ముఖ్య కార్యకర్తల సమా వేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో అధికారాన్ని దక్కించుకునేందుకు పాలకులు నిరుద్యోగులకు అనేక వాగ్దానాలు చేయడం, తర్వాత విస్మరించడం తగదన్నారు. దేశంలో అధికారంలోకి రాకముందు ఛాయ్ అమ్మానని చెబుతున్న మోడీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ కార్పొరేట్ సంస్థలకు విక్రయించేస్తుంటే యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు ఎక్కడి నుంచి వస్తాయని ప్రశ్నించారు. ఏటా రెండుకోట్ల ఉద్యోగాలిస్తానంటూ గద్దెనెక్కిన మోడీ సర్కారు 9 సంవత్సరాలవుతున్నా యువతకు ఉద్యోగాలివ్వలేకపోవడం దారుణమన్నారు. దేశంలో యువత సరైన ఉపాధి లేక లోన్, బెట్టింగ్ యాప్‌ల మోజులో పడి తమ జీవితాలను తామే బలి తీసుకుంటున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. యువతను చైతన్యపరచడం ద్వారా వారి హక్కుల కోసం ఏఐవైఎఫ్ నేతలు నిరంతరం పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గంగాసురేష్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు టీఎల్ వెంకటేష్, కార్యదర్శి జక్కల వెంకటేష్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మహేష్, జిల్లా నేతలు సిద్ధిగాళ్ళ శ్రీనివాసులు, రెడ్డిసాయి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘరానా మోసగాడి ఆటకట్టు

- చవక ధరకే ప్లాట్ల పేరుతో 260 మందికి బురిడీ
- వేరొకరి భూమిలో అక్రమ ప్రవేశం, ప్లాట్లకు పనులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కేశప్ప, చిత్రంలో సీఐ శివాంజనేయులు, ఎస్ఐ రామమోహన్

బి.కొత్తకోట : ప్లాట్ల పేరుతో నిరుపేదలను మోసం చేసిన ఘరానా మోసగాడి ఆటను పోలీసులు కట్టించారు. పేదలకు తన సొంత భూమి దానం చేసి ఇళ్ల స్థలాలుగా ఇస్తానని నమ్మించి.. వేరొకరి భూమిలోకి అక్రమంగా ప్రవేశించి స్థలాలు చూపిన వ్యక్తిని మంగళవారం అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించి డీఎస్పీ కేశప్ప, సీఐ శివాంజనేయులు, ఎస్ఐ రామమోహన్ వివరాలు వెల్లడించారు.

బి.కొత్తకోటలోని కరెంట్ కాలనీకి చెందిన డేరంగుల పెద్ద ఓబులేశు (65) కొంత కాలంగా స్థిరాస్థి వ్యాపార మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నాడు. అయితే ప్లాట్ల పేరుతో పేదలను మోసం చేసేందుకు వేరొకరి భూమిని తనదిగా చెప్పుకొని నమ్మించాడు. దాన విక్రయం ద్వారా రాసిస్తానని చెప్పి, డబ్బు వసూలు చేశాడు. బీరంగిరోడ్డులోని సర్వే నంబర్ 245లో తనకు భూమి ఉందని, అందులో ఇంటి స్థలం ఇస్తానని నమ్మించి ఒక్కొక్కరి నుంచి రూ.3 వేల నుంచి రూ.10 వేలు వసూలు చేశాడు. 260 మందికిపైగా నమ్మి డబ్బు చెల్లించగా వారికి అగ్రిమెంట్లు చేసిచ్చాడు. స్థలాలు చూపుతానని బీరంగి రోడ్డులోని సర్వేనంబర్ 245లోకి వారిని తీసుకెళ్లగా భూమి యజమానులు తహసీల్దార్‌ను ఆశ్రయించారు. ఓబులేశుకు ఆ సర్వేనంబర్‌లో సెంటు భూమి కూడా లేదని తేల్చిచెప్పారు. ఇటీవల సర్వేనంబర్ 243/1లోని 9.27 ఎకరాలు తనదేనని ఓబులేశు పేదలను తీసుకుని భూమిలోకి అక్రమంగా ప్రవేశించి, ప్లాట్లకు సరిహద్దులు నాటే ప్రయత్నం చేశాడు. భూమి యజమానుల్లో ఒకరైన గుండువారిపల్లెకు చెందిన కె.చంద్రశేఖర్ పోలీసులను ఆశ్రయించారు. తమ భూమిలో అక్రమంగా ప్రవేశించి గుంతలు తవ్వి, రాళ్లు నాటి ప్లాట్లు వేస్తున్నారని చేసిన ఫిర్యాదుపై ఎస్ఐ రామమోహన్ దర్యాప్తు చేపట్టారు. రెవెన్యూ అధికారుల నుంచి రికార్డులు పరిశీలించాక ఓబులేశుకు పై సర్వేనంబర్లలో భూమిలేదని, పేద ప్రజలను మోసం చేస్తున్నట్టు నిర్ధారణకు వచ్చారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశాక నిందితుడు ఓబులేశును అరెస్ట్ చేసి మదనపల్లె కోర్టుకు తరలించారు.


నిజం నిర్ధారణ చేసుకోండి

ఎవరైనా భూములు, ప్లాట్లను విక్రయిస్తామని చెబితే జాగ్రత్తగా పరిశీలించాలని పోలీసు అధికారులు కోరారు. సంబంధిత భూముల రికార్డులను తహసీల్దార్ కార్యాలయంలో పరిశీలించాలని వారు చెప్పారు. రికార్డుల మేరకు అంతా కరెక్ట్‌గా ఉంటేనే కొనుగోలు చేయాలని, లేదంటే మోసపోతారని సూచించారు.

బి.కొత్తకోటలో కలకలం

లక్షల విలువైన చోట తక్కువ ధరకే ప్లాట్లు ఇస్తానని నమ్మించిన ఓబులేశును పోలీసులు అరెస్ట్ చేయడంతో డబ్బు చెల్లించిన బాధితుల్లో కలకలం రేగింది. తక్కువ ధరకే ఇస్తానని చెప్పడంతో 260 మందికిపైగా బాధితులు డబ్బు చెల్లించారు. తన భూమి అంటూ ఓబులేశు స్వయంగా బాండు కాగితాలపై అగ్రిమెంట్లు కూడా చేయించి ఇచ్చాడు. ఇప్పుడు తమ పరిస్థితి ఏమిటని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య



సురేఖ మృతదేహం

చాపాడు : మండలంలోని పల్లవోలు గ్రామంలో బద్రిపల్లె సురేఖ(24) అనే యువతి మంగళవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. పల్లవోలుకు చెందిన సుబ్బరాయుడు, సావిత్రి దంపతుల కుమార్తె సురేఖ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా వర్క్ ఫ్రమ్ హోమ్‌లో చేస్తోంది. ఈ క్రమంలో గత కొన్ని రోజులుగా కడపు నొప్పితో బాధపడుతుండేది. మంగళవారం సాయంత్రం ఆసుపత్రికి వెళ్లాలని తన తల్లి సావిత్రితో తెలిపింది. డ్వాక్రా పని మీద చాపాడుకు వెళ్లిన సావిత్రి ఇంటికి తిరిగి రాగా తలుపులు మూసి ఉన్నాయి. చుట్టు పక్కల వారి సాయంతో పగులగొట్టి చూడగా సురేఖ సీలింగ్ ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు మృతురాలి తల్లి సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశ్నాపత్రం బయటకు.. అదుపులోకి యువకులు

చిట్వేలి : పదో తరగతి సప్లమెంటరీ పరీక్షా పత్రం అర్ధ గంట తరువాత బయటకు రాగా తక్షణం స్పందించిన అధికారులు యువకులను అదుపులోకి తీసుకొని ప్రశ్నాపత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఈ సంఘటన చోటు చేసుకుంది. పరీక్షా కేంద్రంలోని కిటికీ పక్కన పరీక్ష రాస్తున్న విద్యార్థి పరీక్ష ప్రారంభమైన అర్ధగంట తరువాత ప్రశ్నాపత్రాన్ని బయట ఉన్న యువకులకు అందించాడు. విషయాన్ని గుర్తించిన ఇన్విజిలేటర్.. పై అధికారికి తెలియజేయగా పోలీసులకు సమాచారం అందించారు. వారు తక్షణం స్పందించి యువకులను అదుపులోకి తీసుకొని ప్రశ్నాపత్రాన్ని స్వాధీనం చేసుకొని అధికారులకు అందజేశారు.